బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్

జిల్లా వ్యాప్తంగా బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు కార్యాలయాలు, కుల సంఘాలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీల నాయకులు, వక్తలు మాట్లాడుతూ.. ఒక్కరోజే జయంతి కాదని, అంబేద్కర్ లాంటి మహనీయున్ని ప్రతిరోజూ తలుచుకోవాలని అన్నారు. ఆయన ప్రపంచ మేధావి అని, భారత జాతిని ఏకతాటిపై నిలిపేందుకు గొప్ప రాజ్యాంగాన్ని అందించారని, ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని, ఆయన స్వప్నించిన సమ సమాజ నిర్మాణం కోసం అందరం కృషి చేయడమే అంబేద్కర్‌కు ఇచ్చే ఘనమైన నివాళి అని కొనియాడారు.

–నమస్తే నెట్‌వర్క్

మణుగూరు టౌన్ : బీఆర్ఎస్ ఆధ్వర్యంలో..

అశ్వాపురం : నివాళులర్పిస్తున్న సీఐ అశోక్‌రెడ్డి

భద్రాచలం : నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పినపాక బీఆర్ఎస్ కార్యాలయంలో..

దుమ్ముగూడెం : నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బూర్గంపహాడ్ : బీఆర్ఎస్ ఆధ్వర్యంలో..

ఆళ్ళపల్లి : అంబేద్కర్ చిత్రాపటానికి పూలమాల ఎంఆర్‌పీఎస్ నాయకులు

చర్ల: బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో..

కరకగూడెంలో..

కొత్తగూడెం అర్బన్: వేడుకలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

ఇల్లెందు: వేడుకలో మాట్లాడుతున్న న్యాయమూర్తి

కొత్తగూడెం ప్రగతి మైదాన్: నివాళి అర్పిస్తున్న ఎస్పీ

ఇల్లెందు: పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే కోరం

అశ్వారావుపేట : అంబేద్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

దమ్మపేట : నివాళి అర్పిస్తున్న నాయకులు

భద్రాచలం : నివాళులర్పిస్తున్న ఐటీడీఏ పీవో

భద్రాద్రి రామయ్యకు ముత్తంగి అలంకరణ

స్వామివారికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం, ఏప్రిల్ 14: భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో సోమవారం అంతరాలయంలో మూలవరులకు హైదరాబాద్‌కు చెందిన భక్తులు రూ.30 లక్షలతో తయారు చేయించి సమర్పించిన ముత్యాలు పొదిగిన ప్రత్యేక గొడుగులను అర్చకులు స్వామివారికి ధరింపచేశారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యబలిహరణం తదితర నిత్యపూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి బేడామండపంలో నిత్యకల్యాణాన్ని జరిపారు.

రాష్ట్ర హైకోర్టు జడ్జిని కలిసిన ప్రముఖులు

జడ్జిని కలిసిన పెన్షనర్స్ జిల్లా అధ్యక్షులు, వైద్యులు

భద్రాచలం, ఏప్రిల్ 14: రాష్ట్ర హైకోర్టు జడ్జి శరత్‌ను సారపాక ఐటీసీ గెస్ట్‌హౌస్‌లో ఆల్ పెన్షనర్స్ జిల్లా అధ్యక్షుడు చల్లగుళ్ల నాగేశ్వరరావు, భద్రాచలం జీవన్ హాస్పిటల్ ప్రముఖ వైద్యురాలు స్పందన సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జడ్జి శరత్‌కు శాలువా కప్పి సత్కరించారు.

21న బీఆర్ఎస్ బైక్ ర్యాలీ

మణుగూరు టౌన్, ఏప్రిల్ 14: ఈ నెల 27వ తేదీన జరిగే బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం, రజతోత్సవ మహాసభ విజయవంతం కోసం ఈ నెల 21వ తేదీన మణుగూరు పార్టీ కార్యాలయం నుంచి బైక్ ర్యాలీకి నిర్ణయించినట్లు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ కార్యాలయం నుంచి సీహెచ్‌పీ మీదుగా రాజుపేట, పీకే1 సెంటర్, కుమ్మరి బజార్, బాపనకుంట, శివలింగాపురం మీదుగా పూల మార్కెట్, అంబేద్కర్ సెంటర్, అశోక్ నగర్, గుట్టమల్లారం, హనుమాన్ టెంపుల్, సీ టైప్, పీవీ కాలనీ, బాంబే కాలనీ, రైల్వే గేట్, శ్రీశ్రీనగర్ బోర్డు వద్దకు చేరుకుంటుందన్నారు. అక్కడి నుంచి సుందరయ్యనగర్ మీదుగా తిరిగి పార్టీ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగుతుందని, గులాబీ రంగు టీ షర్టులు, గులాబీ రంగు చొక్కాలు ధరించి ర్యాలీలో పాల్గొనాలని కోరారు.

యువత క్రీడల్లో రాణించాలి

గుండాల, ఏప్రిల్ 15: యువత క్రీడల్లో రాణించాలని గుండాల ఎస్సై ఎం రాజమౌళి అన్నారు. సోమవారం మండల పరిధిలోని దామరతోగు గ్రామంలో యువతకు వాలీబాల్ కిట్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా మంచి అలవాట్లు అలవర్చుకొని తల్లిదండ్రులకు పేరుప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పోలోస్ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

పినపాక, ఏప్రిల్ 14 మండలంలోని పోట్లపల్లి పంచాయతీ గడ్డిగూడెం గ్రామంలో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. రైతులందరూ ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. వ్యవసాయశాఖ ఏడీఏ తాతారావు, ఎంపీడీవో సునీల్ శర్మ, డీసీఎంఎస్ కో ఆర్డినేటర్ రవి, ఏవో వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

ఈదురుగాలులకు నేలకొరిగిన భారీ వృక్షం

ఈదురు గాలులకు నేలకొరిగిన వృక్షం

బూర్గంపహాడ్, ఏప్రిల్ 14: ఆదివారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షానికి మండల పరిధిలోని మోతేపట్టీనగర్ గ్రామంలో ప్రధాన రహదారి పక్కన ఉన్న ఓ భారీ వృక్షం నేలకొరిగింది. సారపాక–ఇరవెండి ప్రధాన రహదారి కావడంతో అటుగా వచ్చే వాహనదారులు రోడ్డుపై వృక్షం అడ్డుగా ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సోమవారం మధ్యాహ్నానికి పంచాయతీ సిబ్బంది చెట్టు కొమ్మలను నరికించి ప్రొక్లైయినర్ సహాయంతో తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

కరకగూడెం ఎస్ఐగా నాగేశ్వరరావు

కరకగూడెం, ఏప్రిల్ 14: కరకగూడెం పోలీస్‌స్టేషన్ నూతన ఎస్ఐగా పీవీ నాగేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

ఆళ్లపల్లి నూతన ఎస్సైగా సోమేశ్వర్

ఆళ్ళపల్లి, ఏప్రిల్ 4: ఆళ్ళపల్లి పోలీస్‌స్టేషన్ నూతన ఎస్సైగా యం.సోమేశ్వర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బదిలీల్లో భాగంగా కొమరారం పోలీస్ స్టేషన్ నుంచి ఆళ్ళపల్లికి వచ్చారు. గతంలో ఇక్కడ ఎస్సైగా విధులు నిర్వహించిన రతీష్ కొత్తగూడెం ఎస్పీ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

ఇల్లెందు ఎస్సైగా హసీన

ఇల్లెందు, ఏప్రిల్ 14: ఇల్లెందు ఎస్సైగా ఎస్‌కె హసీన సోమవారం విధుల్లో చేరారు. జిల్లా ఐటీ కోర్‌లో పనిచేస్తున్న ఆమె బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇల్లెందు ఎస్సై నాగుల్ మీరా.. కొమరారం పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు.

బాధితురాలిని ఆదుకోవాలి

మణుగూరు టౌన్, ఏప్రిల్ 14: మండలంలోని సమితిసింగారం పంచాయతీకి చెందిన సమ్మక్క బతుకుదెరువు కోసం ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఎదుట కిరాణా కొట్టు నడుపుకొని జీవనం సాగిస్తోంది. తన కుమారుడి పుట్టినరోజు సందర్భంగా రాత్రి 10.30 గంటలకు షాప్‌కు తాళం వేసి ఇంటికి వెళ్లింది. రాత్రి 12.30 గంటల సమయంలో మంటలు చెలరేగుతున్నాయని చెప్పడంతో హుటాహుటిన అక్కడికి చేరుకుంది. పోలీసులు, ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో షాపులో సామగ్రి, రూ.50 వేలు నగదు కాలి బూడిదైంది. సోమవారం ఉదయం సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయోధ్య, సరెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మీకుమారి బాధితురాలిని పరామర్శించారు.

పాండురాజుకు బంగారు పతకం

మణుగూరు టౌన్, ఏప్రిల్ 14: ఈ నెల 13వ తేదీన ఖమ్మంలో జరిగిన ఉమ్మడి జిల్లా ఓపెన్ బ్రెంచ్‌ప్రెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో మణుగూరు స్కై జిమ్‌కు చెందిన పాండురాజు బంగారు పతకాన్ని సాధించారు. జిమ్ ట్రైనర్ నాగరాజు వద్ద శిక్షణ పొందుతున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, స్థానికులు పాండురాజును అభినందించారు.

నేటి బీఆర్ఎస్ కార్యక్రమం వాయిదా

మణుగూరు టౌన్, ఏప్రిల్ 14: బీఆర్ఎస్ పార్టీ రజతత్సోవ మహాసభకు ఆర్థిక వనరుల సర్దుబాటు కోసం జరగాల్సిన కూలీపని చేసే కార్యక్రమం వాయిదా వేసినట్లు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎస్‌కేటీ కిరాణా షాపులో కూలీ పనిచేసే కార్యక్రమం వాయిదా పడిందని తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

ఇల్లెందు, ఏప్రిల్ 14: ఇల్లెందు పట్టణంలో మంగళవారం ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ బస్టాండ్ ఫీడర్ పరిధిలో అత్యవసర మరమ్మతుల కారణంగా కోర్టు ఏరియా, టింబర్ యార్డ్, ఆమ్ బజార్, పోలీస్ స్టేషన్, బుగ్గవాగు, హమాలి బస్తీ ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు. 11 కేవీ ఇల్లెందులపాడు ఫీడర్‌లో అత్యవసర మరమ్మతుల కారణంగా మంగళవారం మధ్యాహ్నం 2.00 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

పాల్వంచ రూరల్, ఏప్రిల్ 14: ఇసుక ట్రాక్టర్‌ను పట్టణ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. పాత పాల్వంచ వద్ద ముర్రేడు వాగు నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్ గుగులోత్ లచ్చుపై, యజమాని పెనుగొండ వినోద్‌పై కేసు నమోదు చేశారు.

మృతుడి కుటుంబానికి సాయం

ములకలపల్లి, ఏప్రిల్ 14: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన దినేష్ కుటుంబానికి దమ్మపేట జడ్పీటీసీ మాజీ సభ్యుడు పైడి వెంకటేశ్వరరావు సోమవారం రూ.10 వేలు, 50 కేజీల బియ్యం అందజేశారు. నాయకులు కూజా రవి, ఉదయ్‌కుమార్, గుంట్రు కృష్ణ యాదవ్, తాటి ప్రవీణ్ పాల్గొన్నారు.

చోరీ కేసు నిందితుడిని ఒక్క రోజులోనే పట్టుకున్నారు..!

ఇల్లెందు, ఏప్రిల్ 14: ఓ చోరీ కేసులో నిందితుడిని ఇల్లెందు పోలీసులు కేవలం ఒక్క రోజులోనే పట్టుకున్నారు. ఈ నెల 11న చోరీ జరిగింది. 12న ఫిర్యాదు అందింది. 14న నిందితుడిని పోలీసులు పట్టుకున్నారు. కోర్టు ఆదేశంతో రిమాండుకు తరలించారు. ఇంత వేగంగా కేసును ఛేదించిన సీఐని, ఆయన బృందాన్ని ఎస్పీ అభినందించారు. ఇల్లెందు పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ చంద్రభాను సోమవారం విలేకరుల సమావేశంలో వెల్లడించిన వివరాలు.. ఇల్లెందులోని సివిల్ లైన్ సత్యనారాయణపురం రోడ్డులోగల ఓ ఇంట్లో ఈ నెల 11న చోరీ జరిగింది. వెండి, బంగారం పోయినట్లుగా మరుసటి రోజున (12న) ఆ ఇంటి యజమాని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ ఇంటిని పోలీసులు పరిశీలించారు. ఆధారాలను క్లూస్ టీం సేకరించింది. సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. బుగ్గవాగు బ్రిడ్జి వద్ద పోలీసులు సోమవారం (14న) తనిఖీలు చేపట్టారు. బ్యాగ్‌తో వెళుతున్న ఓ యువకుడి తీరు అనుమానాస్పదంగా ఉండడాన్ని గమనించారు. పోలీసులను చూడగానే అతడు పారిపోయేందుకు ప్రయత్నించాడు. పోలీసులు వెంబడించి పట్టుకుని, బ్యాగ్ తనిఖీ చేశారు. అందులో 19.99 తులాల బంగారం, 20 తులాల వెండి ఉంది. దీని విలువ సుమారు రూ.7.10 లక్షలు ఉంటుంది. అతడిని పోలీసులు అరెస్ట్ చేసి వివరాలను రాబట్టారు. ఆ యువకుడి పేరు కొర్రి రాహుల్. వయసు 23 సంవత్సరాలు. హైదరాబాద్‌లోని ఉప్పుగూడ/ఫలక్‌నామా ఏరియాలో ఉంటున్నాడు. అక్కడి రాజ్‌పుత్ పిస్తా హౌజ్ హోటల్‌లో పనిచేస్తున్నాడు. ఇల్లెందు సత్యనారాయణపురం రోడ్డులోని ఇంట్లో ఈ నెల 11న బంగారం, వెండి చోరీ చేశాడు. 2020వ సంవత్సరంలో హైదరాబాద్ మీర్‌పేట్, ఇల్లెందు; 2022లో కొత్తగూడెం టూ టౌన్, ఇల్లెందు పోలీస్ స్టేషన్ల పరిధిలో దొంగతనాలు చేసి మూడుసార్లు జైలు శిక్ష అనుభవించాడు. ఈ కేసును ఒక్క రోజులోనే ఛేదించిన సీఐ సత్యనారాయణను, ఆయన బృందాలను ఎస్పీ అభినందిస్తూ రివార్డు ప్రకటించారు. సీఐ బత్తుల సత్యనారాయణ, ఎస్ఐలు నాగుల్ మీరా, సూర్య, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీఎస్పీ చంద్రభాను

ఇందిరమ్మ ఇండ్లకు శంకుస్థాపన

టేకులపల్లి, ఏప్రిల్ 14: మండలంలోని బేతంపూడి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లకు ఎమ్మెల్యే కోరం కనకయ్య సోమవారం శంకుస్థాపన చేశారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జార్జిరెడ్డికి నివాళి

కొత్తగూడెం గణేష్ టెంపుల్, ఏప్రిల్ 14: విద్యార్థి ఉద్యమ నేత జార్జిరెడ్డి వర్ధంతి సభను పీడీఎస్‌యూ నాయకులు సోమవారం కొత్తగూడెంలో నిర్వహించారు. చిత్రపటం వద్ద జిల్లా పూర్వ కార్యదర్శి సురేష్‌కుమార్ తదితరులు పూలు చల్లి నివాళులర్పించారు.

దెబ్బ తిన్న పంటల పరిశీలన

చుంచుపల్లి, ఏప్రిల్ 14: మండలంలో ఆదివారం గాలివానకు వరి పంటలు చాలా వరకు దెబ్బతిన్నాయి. పెనగడప, మూలుగూడెం తదితర గ్రామాల్లో దెబ్బతిన్న వరి పంటలను ఏఈవో మమత సోమవారం పరిశీలించారు. రైతుల నుంచి వివరాలు తెలుసుకున్నారు.

యువకుడి ఆత్మహత్య

అశ్వారావుపేట, ఏప్రిల్ 14: మద్యానికి బానిసగా మారిన యువకుడు.. ఆ మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలానికి చెందిన గడ్డం ప్రసాద్(26), కొంతకాలంగా మద్యానికి బానిసగా మారాడు. రాజానగరం గ్రామం వద్ద ఆదివారం మద్యం తాగాడు. ఆ మత్తులోనే పురుగుల మందు కూడా తాగాడు. రోడ్డు పైనే వాంతులు చేసుకోవడాన్ని స్థానికులు గమనించి, కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. వారు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి, అతడు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ప్రసాద్ తల్లి సుశీల ఫిర్యాదుతో కేసును ఏఎస్సై యాకూబ్ అలీ దర్యాప్తు చేస్తున్నారు.

అగ్ని బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

అశ్వారావుపేట రూరల్, ఏప్రిల్ 14: మండలంలోని పాలగుంపు గ్రామంలో అగ్ని ప్రమాదంతో ఆవాసం కోల్పోయిన నాలుగు కుటుంబాలను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సోమవారం పరామర్శించారు. తాత్కాలిక నివాసానికి సాయం అందించారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

ఢిల్లీలో సెమినార్‌కు 'సింగరేణి' నాయకులు

రామవరం, ఏప్రిల్ 14: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా 'బర్త్ యానివర్సరీ ఆఫ్ డాక్టర్ అంబేద్కర్ అండ్ ఏ జర్నీ ఆఫ్ కాన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇండియా' అంశంపై న్యూఢిల్లీలోని భారత మండపం ఆడిటోరియంలో సోమవారం సెమినార్ జరిగింది. దీనిని నేషనల్ కమిషనర్ ఫర్ షెడ్యూల్డ్ క్యాస్ట్ నిర్వహించింది. నిర్వాహకుల ఆహ్వానంతో ఈ సెమినార్‌కు సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు ఆంతోటి నాగేశ్వరరావు, బందెల విజేందర్, మొగిలిపాక రవి, చెరిపెల్లి నాగరాజు హాజరయ్యారు.

అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం

పోస్టర్ ఆవిష్కరించిన ఎస్పీ

కొత్తగూడెం ప్రగతి మైదాన్, ఏప్రిల్ 14: అగ్నిమాపక వారోత్సవాలను ఎస్పీ బిరుదరాజు రోహిత్‌రాజు సోమవారం తన కార్యాయంలో ఫైర్ అధికారులు, సిబ్బందితో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ముందుగా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ నెల 20వ తేదీ వరకు ఈ వారోత్సవాలు జరుగుతాయి. కొత్తగూడెం అగ్నిమాపక అధికారి జి.పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేట టౌన్, ఏప్రిల్ 14: స్థానిక అగ్నిమాపక కార్యాలయంలో అగ్నిమాపక వారోత్సవాల వాల్ పోస్టర్‌ను సీఐ రవీందర్ సోమవారం ఆవిష్కరించారు. వారోత్సవాలను ప్రారంభించారు. అగ్నిమాపక శాఖ ఎస్సై సైదులు, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎం.మురళి, ఎక్సైజ్ ఎస్సై ఐ.రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికోద్యమ నేత దుర్మరణం

రాసూరి మృతి పట్ల సంతాపం తెలిపిన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా

రామవరం, ఏప్రిల్ 14 : సమస్యలపై ఆయనది అలుపెరుగని పోరాటం.. అనునిత్యం కార్మికుల పక్షం.. తెలంగాణోద్యమంలోనూ కీలక భూమిక పోషించిన ఆ నాయకుడు ఇక లేడని తెలుసుకున్న ప్రతి ఒక్కరూ కన్నీటి పర్యంతమయ్యారు. బైక్‌పై రోడ్డు దాటుతుండగా వెనుక వైపు నుంచి మరో బైక్ ఢీకొనడంతో తీవ్ర గాయాలతో కార్మికోద్యమ నేత మృతిచెందాడు. ఈ ఘటన భద్రాద్రి జిల్లా ఏరియాని ధర్బాద్ వద్ద సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బీఆర్ఎస్ పార్టీ అనుబంధ టీబీజీకేఎస్ సెంట్రల్ కమిటీ మెంబర్, కాంట్రాక్టు కార్మికుల హక్కుల పరిరక్షణ సంఘం అధ్యక్షుడు రాసూరి శంకర్(58) కొత్తగూడెంలో పనులు ముగించుకొని గౌతంపూర్‌కు వస్తున్నాడు. ఈ క్రమంలో ధన్బాద్ పోచమ్మ గుడి వద్ద నుంచి గౌతంపూర్ వెళ్లేందుకు కుడి వైపు వెళ్తున్నట్లు ఇండికేటర్, చేతుల ద్వారా చూపిస్తూ రోడ్డు దాటుతున్నాడు. అయితే కొత్తగూడెం నుంచి విజయవాడ వైపు వెళ్తున్న ఒడిషాకు చెందిన వ్యక్తులు బైక్‌పై వేగంగా వచ్చి శంకర్ బైక్‌ను ఢీకొట్టారు. దీంతో కిందపడిన శంకర్ తలకు తీవ్రమైన గాయం కావడంతో స్థానికులు 108 వాహనంలో సింగరేణి ప్రధాన ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని, తల, కుడిచెయ్యి, పక్కటెముకలు విరిగాయని, మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించాలని వైద్యులు సూచించారు. ఈ క్రమంలో హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడు శంకర్‌కు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. అయితే ఇటీవల జరిగిన బోర్డు మెడికల్ అతడు అన్‌ఫిట్ కావడంతో కూతురుకు ఉద్యోగం ఇప్పించే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. కాగా.. శంకర్ మృతి పట్ల బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణలు సంతాపం తెలిపారు.

రాసూరి శంకర్(ఫైల్)

ఉద్యమంలో శంకర్ పాత్ర మర్చిపోలేనిది..

టీబీజీకేఎస్ సెంట్రల్ కమిటీ మెంబర్‌గా, కాంట్రాక్టు కార్మికుల పరిరక్షణ సంఘం అధ్యక్షుడిగా, కాంట్రాక్టు కార్మికుల బాగు కోసం అనునిత్యం పోరాటం చేస్తూ.. వారికి రావాల్సిన హక్కులపై శంకర్ నిరంతరం శ్రమించారు. 2007లో కొత్తగూడెం ఏరియా ప్రాంతంలో టీబీజీకేఎస్ రెండో స్థానం సాధించడానికి ప్రధాన భూమిక పోషించారు. తెలంగాణ ఉద్యమంలో రుద్రంపూర్ జేఏసీతో కలిసి ప్రతీ పోరాటంలోనూ పాలుపంచుకున్నారు. అరెస్టులు, నిర్బంధాలను ఎదుర్కొన్నారు. 2012లో బీఆర్ఎస్ అనుబంధ గుర్తింపు సంఘంగా టీబీజీకేఎస్ గెలుపొందడంలో కీలక పాత్ర పోషించారు. టీబీజీకేఎస్ జెండా పట్టుకోవడానికి భయపడుతున్న రోజుల్లో కార్మికులకు అండగా ఉండి 2012 ప్రాంతంలో గుర్తింపు సంఘంగా గెలవడంతో ఆయన పాత్ర మర్చిపోలేనిది. ఆయన మరణవార్త విని తెలంగాణవాదులు, కాంట్రాక్టు కార్మికులు, వివిధ పార్టీలు, కుల సంఘాల నాయకులు విచారణ వ్యక్తం చేశారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
టెలికాలర్స్ కావలెను
★ప్రముఖ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ నందు పనిచేయుటకు మంచి వాక్ చాతుర్యం కలిగిన మహిళ టెలికాలర్ కావలెను. జీతం :10,000/- నుండి 20,000/- వరకు ఇవ్వబడును. సంప్ర|| 829752 9999
KMM

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616